“నాకూ, ఆ నేరేడు పళ్లకూ తేడా ఏమిటీ?”

అసలే ఆశలన్నీ కోల్పోయి ఆ ఆవరణలోని నేరేడు చెట్ల కింద ఆలోచనల్లో మునిగి ఉన్న మునిస్వామికి తలా తోకా లేని ప్రశ్న పెనుభూతంలా కనిపించసాగింది.

దాసరి అమరేంద్ర

# దేవగిరి



యువతరం కోసం విశేష శీర్షిక

# ప్రతిబింబాలు

❁ చరిత్ర ❁ సంస్కృతి
❁ వారసత్వం
❁ వాతావరణ పరిరక్షణ +
చమత్కారాలూ మిరియాలూ

## వచ్చేవారం నుండి ప్రారంభం

అప్పుడే త నా చోటి కొచ్చి రెండేళ్లు గడిచిపోయాయి. ఆ రెండేళ్లలో విద్యాసాగర్ గారి శిష్యరికంలో తా నేం నేర్చుకున్నాడో తనకే బోధపడటం లేదు.

నిజమే. విద్యాసాగర్ గారి శిక్షణ పద్ధతి నిర్వచనాని కందనిదే! వివరణకు లొంగనిదే! కానీ ఎన్ని రోజు లిలా గమ్యం తెలియని పయనం? అసలు తను తన జీవిత లక్ష్యం కేసి ముందుకు సాగుతున్నాడో, ఎక్కడ వేసిన గొంగళి అక్కడలా తటస్థంగా నిలచి ఉన్నాడో, చదవేస్తే కాకర కాయ కీకర కాయ అయినట్టు వెనక్కి పోతున్నాడో ఏమీ అంతుపట్టకుండా ఉందే?

ఎంత కాల మిలా? ఏమి టీ దీని కథతం? ఏవీ సాధించకుండానే చివరి కా నేరేడుపండులా ఏదో ఒకనాడు నామకంగా రాలిపోయి దుమ్ములో కలసిపోవడమే తనకు రాసిపెట్టి ఉందా?!

❋ ❋ ❋

విద్యాసాగర్ ఒక విచిత్ర విద్యావేత్త.

ఇంజనీరింగ్ చదివారు పంతొమ్మిది వందల నలభై తొమ్మిదిలో, మద్రాసు గిండీలో.

గవర్నమెంటు ఉద్యోగం చేశారు. విదేశాల్లో మానేజిమెంటు చదువుల కెళ్లారు. బొంబాయి హిందూస్థాన్ లీవర్స్‌లో పర్సనల్ మానేజరుగా పని చేశారు. అహమ్మదాబాద్ మానేజిమెంటు విద్యాలయ వ్యవస్థాపక బృందంలో ఒకరు. హార్వర్డులో పాఠాలు చెప్పారు. గుజరాత్‌లోని 'ఆనంద్' పట్టణంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మానేజిమెంట్ పెట్టాలన్న ఆలోచన వారిదే. ఆ ఆలోచన డెబ్భైలలో రూపు దాల్చింది మొదలు మెరిక ల్లాంటి యువకులకు శిక్షణ ఇచ్చి గ్రామసీమలకు పంపడానికే జీవితాన్ని అంకితం చేసేశారు.

ఆ ఆనంద్ విద్యాలయంలో శిక్షణ పొంది అటు తర్వాత కేరళ తీరపు పల్లెకారుల జీవితాలలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన రవి మీనన్‌కూ, హిమాచలాల పర్వతీయులను సంఘటితపరచి 'వ్యక్తికి బహువచనం శక్తి' అన్న నానుడికి నూతన భాష్యం చెప్పిన కమల్ బహుగుణకూ గాడ్ ఫాద రాయన.

ఆనంద్ ప్రయోగం విజయవంతమైన తర్వాత తన కార్పొరేట్ బాణీ పారిశ్రామిక విలాసాలకు స్వస్తి చెప్పి సగం సన్యాసిగా మారా రాయన. పల్లె ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో అనురక్తి ఉన్న యువకులను ఆయత్తపరచి దేశానికి అందించడమే తన ధ్యేయంగా పెట్టుకున్నా రాయన. ఆ లక్ష్యసిద్ధికి విశాఖకు వాయవ్యాన అరకు లోయల చేరువలో ఉన్న దేవగిరి శిఖరాన్ని తన శాశ్వత స్థావరంగా చేసుకున్నా రాయన.

ఆర్భాటాలు లేని ఆహ్లాదకరమైన ఆవరణలో తన శిక్షణాలయాన్ని ఆరంభిం చారు. కొత్త వాళ్ల కది మునివాటిక లాగానూ, గురుకులం లాగానూ అనిపిస్తుంది. కానీ ఆధునిక విద్యాసౌకర్యాలూ, అత్యాధునికమైన చక్కని గ్రంథాలయమూ ఆ విద్యాలయానికి పెట్టని ఆభరణాలు.

ఒంగోలు గిత్తల్లా, రేసు గుర్రాల్లా కార్పొరేట్ కారిడార్లలో పరుగులు తీయాలని ఉవ్విళ్లూరే యువకులకు హార్వర్డూ, అహమ్మదాబాదూ అంతిమ లక్ష్యాలైతే, జాతి కోసం, దేశం కోసం పూనుకుని ఏదైనా చేసి తీరాలని తహతహలాడే అతి కొద్ది మందికి ఆ దేవగిరి పరమ పవిత్రం.

అక్కడ డిగ్రీ లివ్వరు. పాఠాలు రోజువారీ చెప్పరు. పాతికను మించి విద్యార్థు లెప్పుడూ ఉండరు.

❋ ❋ ❋

'నాకూ, ఆ నేరేడు పండుకూ తేడా ఏమిటీ?'

మునిస్వామి మైసూరు ప్రాంతం వాడు. బెంగుళూరులో సోషియాలజీలో ఎమ్మే చేశాడు. విద్యాసాగర్ గారి విద్యాలయం గురించి విని ఆకర్షితుడై వచ్చి చేరాడు. విద్యాసాగర్ గారి శిష్యు లందరిలోనూ ప్రతిభావంతుడని పేరు పొందాడు.

అయినా అతని కా క్షణాన తన అస్తిత్వాని కర్థం లే దనిపిస్తోంది.

విద్యాసాగర్ గారి శిక్షణ పద్ధతిలో లోప ముందా? అ అవకాశం లేదే! అపారమైన అనుభవమూ, విశేష లోకజ్ఞానమూ రంగరించి జీవితాన్ని కాచి వడ పోసి చేసిన విద్యాసాగర్ గారి బాణీ తప్పయ్యే అవకాశం లేనే లేదు.

మరెందుకు తనలో ఈ శూన్యం? ఏమిటి తన గమ్యం?

ఏదో అశాంతి, నిరాశ, నిస్పృహ!

ఇప్పటిది కా దీ అంతర్మథనం. విద్యాలయంలో చేరిన దగ్గరనుంచీ ఇలాంటి అనుమానాలే వెంటాడుతున్నాయి. అందుకు తన అవగాహనాలోపమే కారణమనీ విద్యాసాగర్ గారి శిక్షణ మార్గాన్ని అర్థం చేసుకుని అంది పుచ్చుకున్న పక్షంలో తన జీవితం జ్ఞానవంతం కాగలదనీ నమ్మి మునిస్వామి ఆ మార్గంలో ఎంతో కృషి

చేశాడు.

కానీ ఫలితం దక్కలేదు. శ్రమంతా అడవి గాచిన వెన్నె లైన ట్టనిపిస్తోంది. విసిగి వేసారి ఆ ఆవరణలోని నేరేడు చెట్ల మధ్య దీర్ఘాలోచనలో పడ్డ మునిస్వామిని మిగల పండి నేల రాలి ధూళిలో కలసి పోతున్న నేరేడు పళ్లు ఆకర్షించాయి.

అతనిలో ఏ మూలో మినుకుమినుకు మంటున్న ఆ కాస్త ఆశా అంతరించింది.

'అవును, నా జీవితమూ ఆ నేరేడు పళ్లలాంటిదే. ఎవరికీ ఏ ఆనందమూ ఇవ్వకుండా ఏదో ఒక రోజున నిశ్శబ్దంగా చెల్లి పోతుంది. ఈ విద్యాలయంలో సంపాదించాలనుకున్న అపూర్వ జ్ఞానపు మాయలేడిని అవతల పెట్టి ఈ వృథా ప్రయాసకు గుడ్ బై చెప్పడం ఉత్తమం!'

నవ్వొచ్చింది మునిస్వామికి. అప్పట్లో యాపిల్ పండు కింద పడటం చూసి న్యూటన్ గారు 'గురుత్వాకర్షణ' అన్న బృహత్తర శక్తిని కనిపెట్ట గలిగారు. తానేమో నేరేడు పళ్ల బరువునే భరించలేక ఓటమికి సిద్ధపడుతున్నాడు!

ఏ దేమైనా ఇక త నా మర్నాడు దేవగిరి దిగి దిగువనున్న సామాన్య జనసమూహంలో కలసి పోవాలని నిశ్చయించుకున్నాడు మునిస్వామి. ఆ విషయం చెప్పడం కోసం విద్యాసాగర్ గారి దగ్గరకు వెళ్లాడు. స్టడీ రూమ్‌లో ఏదో తత్వ శాస్త్ర గ్రంథాన్ని చదవడంలో మునిగి పోయి ఉన్న విద్యాసాగర్ గారి నుద్దేశించి, "సార్ ..." అని చెప్పబోయాడు.

'మునిస్వామీ! రేపు ఉదయం మనిద్దరం కొండ దిగుదాం - కార్లో వద్దు, నడచి.'

ఇక చెప్పవలసిం దేముందీ? సాగర్ గారికి అంతా అర్థమై పోయిందన్న మాట.

* * *

మర్నాటి ఉదయం దేవగిరి దిగబోతూ ఆ శిఖరం చుట్టూ పరచుకుని ఉన్న విశాల సమతల ప్రదేశాన్ని పరీక్షగా చూస్తూ విద్యాసాగర్ గారు అడిగారు - "మునిస్వామీ! నీ కీ చుట్టుపక్కల ఏం కనబడుతోందీ?"

"సార్, దూరాన ఆకాశపు టంచున ఉదయిస్తున్న సూర్యుని కిరణాలు సుమధుర ప్రభాత గీతికల్లా కనిపిస్తున్నాయి. చుట్టూ వేలాది పచ్చని చెట్లూ, ఆ చెట్లను సంతరించుకుని ఉన్న పర్వతాల దొంతరలూ కనిపిస్తున్నాయి. ఆ పర్వతాల లోంచి గంతులు వేస్తూ కిందకు దూముకుతున్న పాలవెల్లువల లాంటి జలపాతాలూ, ఆ జాలపాతాల ధారలను వాడివాడిగా తోడ్కొని సాగిపోతున్న జలతారు తీగల్లాంటి సెలయేళ్లూ కనిపిస్తున్నాయి. అంతటా ఆకు పచ్చని లోయా, ఆ లోయ కటు చివర ఓ చిరుతటాకమూ, ఆ తటాక తీరాన ఓ బుల్లి పల్లె కనిపిస్తున్నాయి."

బుద్ధిగా వివరించాడు మునిస్వామి.

విద్యాసాగర్ గా రా మనోహర వర్ణన విన్నారు. చిరునవ్వు నవ్వారు. వెంట తెచ్చుకున్న ఫ్లాస్కులోని కాఫీ తాగి కొండ దిగటం ఆరంభించారు.

రెండు గంటల పాటు విరామం లేకుండా నడిచి పది గంటల వేళ ఆ పర్వత పాద ప్రాంతానికి చేరుకున్నా రా గురు శిష్యులు.

మరో సారి చుట్టూ పరకాయించి ఏం కనబడుతోందో వివరించమన్నారు సాగర్‌గారు.

"సార్, ... దూరాన చేల గట్లపై చిందులు వేస్తున్న లేగ దూడలు కనిపిస్తున్నాయి. అటు పక్క పచ్చిక బయళ్లలో ఆదమరచి మేస్తున్న గోగణాలు కనిపిస్తున్నాయి. సెలయేటి జలాలలో ఈదులాడుతున్న పిల్లలు కనిపిస్తున్నారు. ఇటు పక్క కాఫీ హోటల్లో పనిచేస్తున్న శ్రామికులు కనిపిస్తున్నారు. ఆ చెరువు పక్క గ్రామంలో ఆరు బయట పడుకుని నీ రెండను మేస్తున్న పెద్ద వాళ్ల బృందం కనిపిస్తోంది."




విద్యాసాగర్ గారో నిముషం మౌనంగా ఉండి పోయి నడక కనసాగించారు. ఆ చిరుగ్రామపు పొలిమేరలు చేరుకుని ఎర్ర తామరల కొలను పక్కది మర్రి చెట్టు నీడన కూర్చుని బ్రేక్ ఫాస్ట్ సర్దుతూ అడిగారు - "ఈ రోజు ను వ్వేయే విషయాలు గ్రహించ గలిగావోయ్? బహుశా నేను నీకు ఇవ్వగల చిట్టచివరి శిక్షణ ఇదే ననుకుంటాను.'

మునిస్వామి కేమీ పాలు పోలేదు. మాట్లాడకుండా ఉండి పోయాడు.

"చూడు, మునిస్వామీ! విజ్ఞాన పథం కొండ దారి లాంటిది. కొండ శిఖరం మీద నిలబడి చూడగలిగేది వేరూ, కొండ దిగువున నిలబడి చూడగలిగేది వేరూ అన్న విషయం తెలిసిన నాడే విజ్ఞాన పథ ద్వారాలు తెరుచుకుని ముందుకు సాగగలుగుతాం. నిజజీవితాన్ని విభిన్న కోణాల్లోంచి చూడ గలిగిన నాడే మన దృక్పథం విశాల మవుతుంది. ఆ స్పృహ లేని నాడు మన మున్న స్థానం నుంచి కనిపించేదే సర్వస్వ మన్న భ్రమలో మునిగి తేలుతాం. మన కంటికి కనిపించని విషయాలను మూర్ఖంగా విస్మరించేస్తాం. మన మానసికాభివృద్ధికి మనమే ప్రతిబంధక మవుతాం.

"మనం చూస్తున్న దెంతో పరిమితం, చూడలేని దపరిమితం అన్న విషయం గ్రహించ గలిగిన నాడు విజ్ఞానపథ రహస్యం మనకు కరతలామలకమైనట్లే! ఆనాడే మన జ్ఞానమార్గ పయనం ఆరంభ మవుతుంది. మన మనః కవాటాలను బార్లా తెరిచి మన కంటికి కనిపించని అనేకానేక విషయాలను బుద్ధితోనూ, మనస్సుతోనూ గ్రహించి గౌరవించగల శక్తి అవరచుకుంటాం."

"అంచేత ఒక్క విషయం బాగా గుర్తుపెట్టుకో. గిరి శిఖరం నుండి కనిపించేదే అంతిమ సత్యం కాదు. ఒకే విషయం ఒక్కొక్క చోటి నుండి ఒక్కొక్క విధంగా కనిపించే అవకాశవ ఉంది."

మునిస్వామి ఆకాశపు టంచుల్లోకి చూశాడు.

జగత్తు కంతా తన బంగారు కిరణాలతో కాంతి నిచ్చిన సూరీడు తన మనస్సు లో కూడా అనంత కోటి కాంతి పుంజాలను నింపుతున్న ట్లనిపించింది.

విద్యాసాగర్ గారి వైపు చూశాడు. అడిగాడు - "నే నిక దేవగిరి మీద కొచ్చి శిక్షణ పొందాల్సిన అవసర ముందంటారా?"

"లేదు, ఇదే నేను నీ కిస్తున్న ఆఖరి శిక్షణ."

విద్యాలయం వారి జీపులో మునిస్వామి సామా నంతా కిందకు చేరింది. అదే జీపులో విద్యాసాగర్ గారు పైకి వెళ్లిపోయారు.

మునిస్వామి మైసూరు ప్రాంతాలలోని నీలగిరులు చేరుకున్నాడు. ఓ నూతన స్ఫూర్తితో సామాన్య జనజీవనంలో కలసిపోయాడు. కొద్ది కాలంలోనే అక్కడి ప్రజానీకానికి తలలో నాలు కయ్యాడు!